## ఆయన లేని పదేళ్లు — ఆంధ్రజ్యోతి సంపాదకీయం

(10 అక్టోబర్ 2019, ఆంధ్రజ్యోతి)

అరనిమిషం దాటేసరికి అదే నాకు గత శతాబ్ది అని శ్రీశ్రీ ఆధునికుడి కాలమానాన్ని, అర్థవంతమైన ప్రగతి వేగాన్ని గొప్పగా చెప్పుకున్నాడు కానీ, అనర్థదాయకమైన, అర్థరహితమైన వేగంలో కొట్టుకుపోతున్న వర్తమాన జీవితంలో ఇంత ధ్యానానికీ, మౌనానికీ, కాసింత స్ఫురణకీ, గతస్మరణకీ వెసులుబాటే లేదు. కాసేపు నెమరువేసుకోవడానికి ఏ క్షణమూ అరక్షణమైనా ఆగడం లేదు. చూపులను మాయచేసే దృశ్యాలు, వలపోత సాధ్యం కాని ఎడతెగని దుఃఖాలు, కొత్తఆశలకు అవకాశమివ్వని ఆశాభంగాలు, మనసును ఉన్మత్తం చేసే భ్రమావేశాలు— వీటి మధ్య జీవిస్తున్నట్టు కాక, మనిషి రోలర్‌కోస్టర్ మీద జారిపోతున్నట్టు బతుకుతున్నాడు. కాలం వేగం కలగలసిపోయిన పతనప్రస్థానంలో కూడా మనకు జ్ఞాపకమై నిలిచేవారు, నిలదొక్కుకోవడానికి నిలిచి ఆలోచించడానికి ప్రేరణగా నిలిచేవారు కొందరు ఉంటారు. కొందరు నడిచివెళ్లిన నేల, గడిపివెళ్లిన కాలం ఎంతటి జాజ్వల్యమానంగా, ఎంత చైతన్యశీలంగా ఉంటాయంటే, వారు జీవించి వెళ్లినందుకు కృతజ్ఞతగా అనిపిస్తుంది.

బాలగోపాల్ వెళ్లిపోయి పదిసంవత్సరాలైంది. కాలం గడచిపోతూనే ఉన్నది. గడచిపోయినవాటిని ఎన్నిటినో మరపు మింగేస్తూనే ఉన్నది. కానీ బాలగోపాల్ ప్రతి సందర్భంలోనూ గుర్తుకు వస్తున్నాడు. ఆయన ప్రతిభాపాటవాలకో, సాహసశౌర్యాలకో, మేధోసంపదకో మురిసిపోయి ఆయన గురించి తలచుకోవడం కాదు, ప్రజలు తమ అవసరాలకు తలచుకుంటున్నారు. తమకు ఎదురయిన లోటు గురించి బాధపడుతున్నారు. ఆయన ఇప్పుడుంటే బాగుండేదని వెలితిపడుతున్నారు. ఒక సమస్య వస్తే ఆయన అక్షరాలను పరామర్శించి అర్థాలను వెదుక్కుంటున్నారు. ఆయనలాంటి వాళ్లను సమాజం తయారు చేసుకోకపోవడం లోటే. తనంతటివారిని ఒకరినైనా తీర్చిదిద్దకపోవడం ఆయన తప్పే. అందుకు ఇప్పుడు అందరూ అదనంగా కష్టపడుతున్నాము.

కాలికి బలపం కట్టుకుని బాధితుల దగ్గరికి తిరిగిన కార్యకర్తృత్వాన్నో, ప్రపంచాన్ని మార్చే పనికి కావలసిన చూపును, ఆ చూపు లోతులను చర్చించినందుకో మాత్రమే కాదు బాలగోపాల్‌ను స్మరించుకుంటున్నది. రాజ్యంతోనో, ప్రజావ్యతిరేకమైన దేనితోనైనా ప్రజలకు ప్రయోజనాల ఘర్షణ ఏర్పడినప్పుడు, ఆ సన్నివేశంలో తిరుగులేని ఒక నైతిక, రాజకీయ వైఖరిని గుర్తించి దాని మీద నిలబడతాడు బాలగోపాల్, తనతో నడిచేవాళ్లందరినీ నిలబెడతాడు. రాజ్యాంగ బద్ధత ఒక ప్రమాణం. కానీ, ఆ రాజ్యంగంలోని హక్కులు కూడా

ప్రజాపోరాటాల ఫలితమే. పౌరహక్కులు కూడా వాటంతటి అవి కొలమానాలుకావు. మనుషులు ఎప్పటికప్పుడు ఏర్పరిచే, స్థిరపరిచే నైతిక ప్రమాణాలతో సాపేక్షమైనవే. వైదిక పరిభాషలో ఉండిన సూనృతము అన్న మాటకు ఎటువంటి ఛాందసార్థం ఉన్నదో తెలియదు కానీ, బాలగోపాల్ ప్రజాఆచరణకు ఉండవలసిన సూనృతశక్తిని గుర్తించాడు. బాధిత, పీడిత ప్రజల హక్కుల కోసం ఎడతెగకుండా సంచరిస్తూనే, తన ఆచరణ నుంచి పదునెక్కిన చూపుతో ప్రపంచాన్ని వ్యాఖ్యానించాడు బాలగోపాల్. నిర్దాక్షిణ్యమైన ఆయన కలం నుంచి సత్యం ఖడ్గధారలాగా మెరిసేది.

తెలంగాణ ఉద్యమం తీవ్రతను అందుకుంటున్న రోజులలో 2009 అక్టోబర్ 8న బాలగోపాల్ మరణించారు. మరి రెండు నెలల్లో కెసిఆర్ దీక్ష, చిదంబరం ప్రకటన, రాజకీయపక్షాల వైఖరిలో మార్పు, ఆత్మాహుతులు, శ్రీకృష్ణ కమిటీ.. ఈ హింసాత్మక, విషాద పరిణామాలన్నిటిలో ఒక వ్యాఖ్యాత, యుద్ధం నడిబొడ్డున నిలబడి నిజం చెప్పే వ్యాఖ్యాత లేని లోటు తెలిసివచ్చింది. కశ్మీర్ కల్లోల్లాన్ని ప్రత్యక్షంగా చూసి అక్కడి దుర్మార్గాన్ని, దుఃఖాన్ని దేశప్రజలందరికీ తెలియజేసిన బాలగోపాల్ ఇప్పుడు సజీవులుగా ఉంటే? దేశవ్యాప్తంగా భయానక వాతావరణం నెలకొని భవిష్యత్తు అంటే భయం మాత్రమే మిగిలిన ఈ రోజుల్లో ఆయన ఏమి చెప్పిఉండేవారు? విప్లవకమ్యూనిస్టులనే నిలదీయగలిగిన ఆయన స్థైర్యం, ఇవ్వాళ్ల ఓడిపోతూ, లొంగిపోతూ, తమ ప్రకటిత లక్ష్యాలను విస్మరిస్తున్న కొందరు సామాజిక న్యాయవాదులను కూడా నిర్భయంగా నిలదీయగలిగేది. ఆయనకు తప్ప ఎవరికి ఉన్నది అంతటి నైతిక స్థాయి?

బాలగోపాల్ స్మరణ వ్యక్తి ఆరాధన కాదు. ఆయనను తీర్చిదిద్దినది చరిత్రే. తాను విమర్శించిన ప్రజాపోరాటాలే ఆయన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయి. కాకపోతే, ఆయన మరింత నిశితంగా చూడగలిగారు. సమాజాన్ని ప్రజాస్వామ్యీకరించడం, మానవీకరించడం ఒక నిరంతర ప్రక్రియ, అందులో ప్రతి ఒక్కరి ఆచరణకూ అవకాశం ఉన్నదని ఆయన సూచించారు. గొప్ప సమాజం అద్భుతమైన భవితవ్యం వంటి ఆశలు వేగంగా శీఘ్రంగా ఒకేరకమైన ఆచరణతో సాధ్యమన్న ఆశలను ఆయన బలహీనపరిచి ఉండవచ్చును, కానీ, కొద్దికొద్దిగా మనుషులందరూ తమలోనూ, బయటా కూడా ప్రజాస్వామిక స్థలాన్ని విస్తరించుకుంటూ పోవాలన్న కర్తవ్యాన్ని గుర్తింపజేయడానికి ప్రయత్నించారు.

బాలగోపాల్ ఆచరణ, రచన — ఈ రెండూ అనేక పర్యాయాలు పునర్దర్శనం చేయవలసినవి. ఆయన చెప్పిన మాటలను, గమనించిన అంశాలను విస్తృతంగా చర్చించవలసిన అవసరం ఉన్నది. ప్రమాదకరంగా మారుతున్న పరిణామాల మధ్య ఆ చర్చ కొత్త మార్గానికి, కొత్త ఆశలకు ఆస్కారం ఇవ్వగలదు.